
సాక్షి
గుంటూరు
సోమవారం ౹ 20 ౹ మే ౹ 2024



పాండురంగడికి అభిషేకాలు

భట్టిప్రోలు: వేమవరంలోని రుక్మాబాయి సహిత పాండురంగస్వామికి ఆదివారం బ్రహ్మీ ముహూర్తాన పంచామృత అభిషేకాలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



ఫిరంగిపురం: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధనోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ అనంతరం స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా జైలును సందర్శించిన జడ్జి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా జైలును జిల్లా జడ్జి వై.వి.ఎస్.జి.పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి ఆదివారం సందర్శించారు. ఈ క్రమంలో వంటశాల, రేషన్ స్టోర్, ఖైదీలు భుజించేందుకు సిద్ధమైన ఆహారాన్ని పరిశీలించారు. ప్రతి ఖైదీతోనూ మాట్లాడారు. వారికి అందుతున్న న్యాయ సహాయం, ఇతర మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పును మళ్లీ చేయవద్దని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో జీవించాలని చెప్పారు. జైలు అధికారులు సరైన ప్రమాణాలను ఆచరిస్తూ ఖైదీల హక్కులను కాపాడుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు నిర్వహణలో అధికార, సిబ్బంది కృషిని ప్రశంసించారు. జిల్లా జైలు సూపరింటిండెంట్ కె.రఘు, జైలర్ సీహెచ్.కిరణ్, డిప్యూటీ జైలర్ ఎ.కల్యాణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



కాకుమాను: పెదనందిపాడు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బిళ్లా మరియమ్మ(106) ఆదివారం వేకువజామున అనారోగ్య కారణంతో మృతి చెందారు. మృతురాలికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమెకు మనుమలు, మనుమరాళ్లు, ముని మనుమలు కలిపి మొత్తం 40 మంది సంతానం ఉన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జానకి వల్లభ నృత్య కళాకేంద్రం (వెలగపూడి) నాట్యాచారిణి అలేఖ్య శిష్య బృందం ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టింది. ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నూతలపాటి తిరుపతయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రదర్శనను ప్రారంభించారు. తొలుత మూషిక వాహనతో ప్రారంభమై, ఏకదంతాయా, ముకుంద ముకుంద, కొండలలో నెలకొన్న, బ్రహ్మ మొక్కటే, పలుకే బంగారమాయెరా అంటూ పలు అన్నమయ్య కీర్తనలకు చక్కగా నృత్య ప్రదర్శన చేశారు. ప్రేక్షకులను అలరించారు. ఎ.బి.బ్రహ్మజీ కార్యక్రమాన్ని నిర్వహించగా, అనంతరం దేవాలయ పాలకవర్గం నాట్యాచారిణి అలేఖ్య శిష్యబృందాన్ని సత్కరించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు.

పెళ్లి కుమారుడిగా రంగనాథుడు



యద్దనపూడి: మండలంలోని సోలస గ్రామంలోని భూ సమేత రంగనాయక స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవతామూర్తులకు అభిషేకాలు చేసి మహిళలు ఆలయ ప్రాంగణంలో పసుపు కొట్టుడు కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం వధూవరులకు పసుపు పూసి సుందరంగా తీర్చిదిద్దారు ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి రామకృష్ణచార్యులు నేతృత్వంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించగా ధర్మకర్తలు అరవపల్లి మనోహర్ నాగలక్ష్మి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుగంచిప్రోలులో భక్తజన సందడి

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. వచ్చే నెలలో పాఠశాలల ప్రారంభం, రైతులు వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉండడంతో భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఫిట్‌నెస్ సిలబస్

- నేటి నుంచి బస్సుల ఎఫ్‌సీలు జారీ చేయనున్న రవాణాశాఖ అధికారులు
- ఈనెల 15తో ముగిసిన గడువు తేదీ
- పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు ఎఫ్‌సీలు జారీ
- గుంటూరు జిల్లాలో 1,500పైగా విద్యాసంస్థల బస్సులు

విద్యాసంస్థల బస్సులకు ఎఫ్‌సీలు కచ్చితంగా తీసుకోవాలి



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న డీటీసీ కరీం, ఆర్టీవో అధికారులు (ఫైల్)

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల(ఎఫ్‌సీ)పై రవాణాశాఖ అధికారులు దృష్టి సారించారు. గత ఏడాది మే 15 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు ఎఫ్‌సీలు జారీ చేసిన అధికారులు, గడువు తేదీ ఈనెల 15తో ముగియటంతో బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రతి ఒక్క పాఠశాల, కళాశాల యాజమానులు తప్పకుండా ఎఫ్‌సీ పొందాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా బస్సులు రోడ్డెక్కితే.. సీజ్ చేయటంతోపాటు జరిమానాలు విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆర్టీఓ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం.. జిల్లాలో 1,500కిపైగా పాఠశాల, కళాశాలల బస్సులు ఉన్నాయి. రూల్ నెంబర్ 185(ఎఫ్) ప్రకారం.. కచ్చితంగా ప్రతి స్కూల్, కళాశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి. వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పని సరిగా తీసుకోవాలి. ఆర్టీఓ అధికారులు పూర్తిస్థాయిలో అన్ని తనిఖీలు నిర్వహించిన తరువాతే.. బస్సు రోడ్డెక్కేందుకు అనుమతులు ఇస్తారు. ఎఫ్‌సీ కలిగిన బస్సులు మాత్రమే విద్యార్థులను స్కూల్, పాఠశాలల నుంచి గమ్యస్థానాలకు చేర్చాలి.

నిబంధనలు ఇలా..

స్కూల్, పాఠశాలలకు సంబంధించి నిబంధనలు ఇలా ఉన్నాయి. 60 ఏళ్ల వయో పరిమితి దాటిన వ్యక్తి డ్రైవింగ్‌కు అనర్హుడు. డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయా యాజమాన్యాలు ఆరోగ్య పరీక్షలు విధిగా చేయించి, ఆ రికార్డులను భద్రపరచాలి. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియజేయటంతోపాటు, 5 సంవత్సరాల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయటంతోపాటు, ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను రిజిస్టర్ చేయటంతోపాటు, ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఉంచాలి. అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరుచుకునే బాక్సులు సబ్ రూల్ 'ఏ', 'బీ' ప్రకారం తప్పని సరిగా పాటించాలి. ప్రతి బస్సులో ఒక అటెండర్ ఉండాలి. ప్రతి వాహనంలో ప్రయాణించే విద్యార్థుల వివరాలను తప్పనిసరిగా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు నోట్ చేసుకోవటంతోపాటు, తల్లిదండ్రులకు డ్రైవర్ వివరాలను తెలియజేయాలి. 15 సంవత్సరాలు దాటిన బస్సులకు అనుమతి ఉండదు. ప్రతి ఒక్కరూ డ్రైవర్, యాజమాన్యాలు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. డ్రైవర్‌ల ప్రవర్తనపై దృష్టి సారించాలి.

గత నాలుగేళ్లగా విద్యాసంస్థల బస్సులపై కేసులు ఇలా..	
సంవత్సరం	కేసుల సంఖ్య
2020-21	51
2021-22	545
2022-23	382
23-24	145
మొత్తం	1,123

కేసులు నమోదు

నిబంధనలు పాటించకుండా నడుపుతున్న విద్యాసంస్థల బస్సులపై కేసులు నమోదు చేయటంతోపాటు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. సోమవారం నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపడుతున్నారు.

అనుమతి తప్పనిసరి



విద్యా సంస్థల బస్సుల ఎఫ్‌సీల గడువు తేదీ ఈ నెల 15తో ముగిసింది. సోమవారం నుంచి ఎఫ్‌సీల జారీకి సిద్ధమయ్యాం. జిల్లాలో ఉన్న అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా ఎఫ్‌సీలు తీసుకోవాలి. అనుమతులు లేకుండా బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎఫ్‌సీలు తీసుకున్న అనంతరం తనిఖీలు నిర్వహిస్తాం. ఏ ఒక్క నిబంధనను విస్మరించినా.. కేసుల నమోదుతోపాటు వాహనాలు సీజ్ చేస్తాం.

– షేక్ కరీం (డీటీసీ, గుంటూరు)

ఏఎన్‌యూ పరిసరాల్లో పటిష్ట బందోబస్తు

- సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్
- ఎన్నికల కోడ్, 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- అభ్యర్థులు, పార్టీల కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదు
- ఎస్పీ తుషార్ డూడీ స్పష్టీకరణ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ), పరిసరాల్లో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రధాన కూడళ్లలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. అదనపు బలగాలతో పహారా కొనసాగుతోందని వెల్లడించారు. కౌంటింగ్ అనంతరం జిల్లాలో ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్ నిర్వాహకులు పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో విక్రయించరాదని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాణసంచా నిల్వ చేసే కేంద్రాల్లోనూ పోలీస్, అగ్నిమాపక శాఖ సమన్వయంతో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్, సెక్షన్ 144, 30 పోలీస్ చట్టం అమల్లో ఉందని స్పష్టం చేశారు. ఎక్కడా నలుగురు కంటే ఎక్కువ మంది ఉండొద్దని చెప్పారు. బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని సూచించారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను, కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం/వదంతులు ప్రచారం చేయడం చట్ట రీత్యా నేరమని, రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపైనా కఠిన చర్యలు ఉంటాయని వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత బైకులకు సైలెన్సర్లను తొలగించి, ఎక్కువ శబ్దంతో నడిపినా కేసులు తప్పవని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

అకౌంటెంట్ సిరిల్‌పాల్‌పై విచారణకు ఆదేశం

- నగరపాలక సంస్థలో రూ.అరకోటి దారి మళ్లింపు వ్యవహారంలో కీలకమలుపు
- గతంలోనే సిరిల్‌ని సస్పెండ్ చేసి, కేసు నమోదు చేసిన నగర కమిషనర్
- తాజాగా ఓ వ్యక్తి ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలు
- విచారణాధికారిగా సీడీఎంఏ నియమించాలని ఆదేశం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నగరపాలక సంస్థలో 2022లో కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులను తన బినామీ ఖాతాలకు మళ్లించి సస్పెండ్ అయిన అకౌంటెంట్ సిరిల్‌పాల్‌పై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. 2020లో ఓ కాంట్రాక్టర్ చేసిన అభివృద్ధి పనులకు చెక్కులు తయారు చేసిన అకౌంట్ సెక్షన్ ఆ చెక్కులను పలు బినామీ ఖాతాలకు మళ్లించింది. ఈ విషయం 2022 నవంబర్‌లో బయటకు పొక్కింది. దీనిపై విచారణ చేపట్టిన కమిషనర్ కీర్తి చేకూరి రూ.అర కోటి వరకు దారి మళ్లించారని తేలడంతో అప్పట్లో అకౌంటెంట్‌గా పనిచేసిన సిరిల్‌పాల్‌ను సస్పెండ్ చేయడంతో అతనిపై సైబర్ క్రైమ్ నేరంగా లాలాపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించారు. ఇంకా దీనిపై పూర్తి విచారణ చేసి ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో లెక్క తేల్చడానికి స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ వారికీ అప్పట్లో కమిషనర్ కీర్తి చేకూరి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు సిరిల్‌పాల్‌పై చర్యలు లేకపోవడంతో ఓ వ్యక్తి ఏప్రిల్ 26న ప్రభుత్వానికి అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశాడు. దీంతో సిరిల్‌పాల్‌పై సమగ్ర విచారణ చేపట్టి పూర్తి వివరాలతో నివేదిక అందించాలని ఇటీవల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి ఎం.ప్రతాప్‌రెడ్డి సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్)ని ఆదేశించారు. మరి కొద్ది రోజుల్లో ఈ విషయంపై సీడీఎంఏ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు.



గ్రామోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



ఉత్సవంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నృసింహస్వామి జయంత్యుత్సవాలు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ నరసింహమూల మంత్రహోమం, సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేన పూజ, అగ్నిప్రణయనం, కుమ్భారాధన నారసింహ హోమం పూజలు చేశారు. అనంతరం స్వామికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు ఏకరీతిన కొనసాగింది. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. మరోవైపు ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జితసేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొనగా, అమ్మవారిని దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు. భారీసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోగా వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన అధికారులు తగుచర్యలు చేపట్టారు. రికార్డుస్థాయిలో ఆదివారం ఒక్కరోజే సుమారు 60 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తుండగా, దేవస్థానానికి రూ. 41లక్షల ఆదాయం సమకూరింది. కేవలం టికెట్ల విక్రయాల ద్వారానే రూ.21లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. రూ.500 విలువగల వీఐపీ టికెట్లు 2,450, రూ.300 టికెట్లు 1,050, రూ.100 టికెట్లు 7050 విక్రయించారు. సర్వదర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పట్టింది. ఉదయం ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్లమార్గంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఓ దశలో ఓం టర్నింగ్‌లోని రూ.300 టికెట్ కౌంటర్ వరకు సర్వదర్శనం క్యూలైన్ చేరింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

ఉత్తమ ప్రదర్శన 'ఇంద్రప్రస్థం'

- ముగిసిన రాష్ట్రస్థాయి నాటికల పోటీలు
- ద్వితీయ ప్రదర్శనగా 'మూల్యం'
- ఉత్తమ నటుడు, దర్శకుడిగా రవీంద్రారెడ్డి



ఉత్తమ ప్రదర్శన ఇంద్రప్రస్థం నాటికకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, కొలకలూరు, వైకే నాటక కళాపరిషత్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ మండలం కొలకలూరులో నిర్వహించిన దశమ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ముగిశాయి. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఇదే నాటికలో నటించి దర్శకత్వం వహించిన ఎస్.రవీంద్రారెడ్డి ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు బహుమతులను అందుకున్నారు. ఈ నాటికకు ఉత్తమ లైటింగ్ బహుమతిని పి.శేషగిరిరావు స్వీకరించారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'మూల్యం' నాటిక ద్వితీయ బహుమతికి ఎంపికైంది. జయంతి పాత్రధారి జ్యోతిరాజ్ భీశెట్టి ఉత్తమ నటిగా, రాజారావు పాత్రధారి డాక్టర్ వెంకట్ గోవాడ ఉత్తమ సంభాషణల నటుడిగానూ బహుమతులను అందుకున్నారు. ఇదే నాటికకు సంగీతం సమకూర్చిన ఎం.నాగరాజు ఉత్తమ సంగీతం బహుమతిని స్వీకరించారు. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సమాఖ్య వారి 'కొత్త పరిమళం' నాటిక ఎంపికైంది. ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా కొల్లా రాధాకృష్ణ (రైతే రాజు నాటిక), ఉత్తమ ప్రతినాయకుడిగా ఎం.వెంకట్‌రాజు (కొత్తపరిమళం), ఉత్తమ హాస్య నటుడిగా జి.సురేంద్రబాబు (రాజుగారి గోచి), ఉత్తమ బాల నటుడిగా భార్గవ్ నందన్, ఉత్తమ రచయిత గంధం నాగరాజు (నోట్ దిస్ పాయింట్), ఉత్తమ ఆహార్యం పి.శేషగిరి (రాజుగారి గోచి), ఉత్తమ రంగాలంకరణ సింగూరు రమణ (కొత్త పరిమళం) ఎంపికయ్యారు. జ్యూరీ బహుమతులను నడింపల్లి వెంకటేశ్వర్లు, సీహెచ్ కార్తీక్, ఎం.రామాంజనేయులు, భుజంగరావులకు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా బి.నరసయ్య, వనం లక్ష్మీకాంతారావు, వైఎస్‌కేఎన్ స్వామి వ్యవహరించారు. ఆదివారం రాత్రి జరిగిన సభలో సినీ రచయిత సాయి మాధవ్‌బుర్రా బహుమతులను ప్రదానం చేశారు.



ఇంద్రప్రస్థం నాటికలోని ఓ సన్నివేశం

ప్రగతి పథంలో బాలికల కళాశాల

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతిపెద్ద గరల్స్ కాలేజీ
- 1,003 మంది విద్యార్థినులతో అలరారుతున్న సరస్వతీ నిలయం
- ఏటా ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటుతున్న వైనం
- రూ.1.32 కోట్లతో కళాశాలలో ఆధునిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం
- గతేడాది 'జగనన్న ఆణిముత్యాలు'గా ఎంపికైన విద్యార్థినులు

చదువుకు శు'భాలిక'



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలలూ ఆధునీకీకరణ బాటపట్టాయి. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. గుంటూరు నగర నడిబొడ్డున సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల బాలికా విద్యకు చిరునామాగా నిలిచింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బాలికల కోసం నిర్వహిస్తున్న అతిపెద్ద జూనియర్ కాలేజీ ఇదే కావడం విశేషం. గత విద్యాసంవత్సరంలో 1,003 మంది విద్యార్థినులు ఇక్కడ విద్యాభ్యాసం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ఈ కళాశాల ప్రగతిపథంలో పయనిస్తోంది. ఈ కళాశాలలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వం ఆధునిక వసతులను సమకూర్చుతోంది.

శరవేగంగా అభివృద్ధి పనులు

కళాశాలలో నాడు–నేడు ద్వారా రూ.1.32 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తరగతి గదుల ఆధునీకీకరణ, గ్రానైట్‌తో ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ, సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాటు పనులు చేస్తున్నారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా రెండంతస్తుల్లో 42 టాయిలెట్లతో కూడిన బ్లాక్ నిర్మాణంలో ఉంది. సురక్షిత తాగునీటిని అందించేందుకు మూడు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మనబడి నాడు–నేడుతో కళాశాల స్వరూపం పూర్తిగా మారిపోనుంది.

కళాశాలలో అందిస్తున్న కోర్సులు

ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఇంగ్లిషు మీడియంలో బోధన అందిస్తున్నారు. తరగతి గదుల్లో ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, డ్యూయల్ డెస్క్‌లు, ఐఎఫ్ ప్యానెల్స్‌తో డిజిటల్ విద్యాబోధనను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గత విద్యాసంవత్సరంలో ఫస్టియర్‌లో 50.11 శాతం, సెకండియర్‌లో 65.52 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

రాష్ట్రస్థాయిలో విద్యార్థినుల ప్రతిభ

ఏటా ఇక్కడి విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. గత నెలలో విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఎంపీసీ విభాగం నుంచి ఎంవీ గీతాజ్యోతి వెయ్యి మార్కులకు 964, బైపీసీలో షేక్ రిహానా 963, షేక్ అస్మా కౌసర్ 958, షేక్ రిజ్వానా 954, షేక్ రేష్మ 953, షేక్ సల్మా 944 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో ఎస్. రాజేశ్వరి 500 మార్కులకు 480, సీఈసీలో పి. మనీషా కుమారి 469, కె. శివదుర్గ 468, ఎంపీసీ విభాగంలో వల్లూరి రమ్య 470కి 436, హెచ్ఈసీలో డి. దివ్య ఒలీవ్ 435, బైపీసీలో ఎండీ అఫీఫా తబసుమ్ 440 మార్కులకు 405 మార్కులు సాధించారు. గతేడాది ఇంటర్మీడియెట్‌లో చూపిన ప్రతిభకు విద్యార్థినులు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా రాష్ట్రస్థాయిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నుంచి ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందుకున్నారు. అదే విధంగా నియోజకవర్గ, జిల్లాస్థాయిలోనూ నగదు పురస్కారాలను అందుకున్నారు.

ఆధునిక వసతులతో విద్యాబోధన



కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఆధునిక వసతులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నాం. డ్యూయల్ డెస్క్‌లతో పాటు ఐఎఫ్ ప్యానెల్స్ ఏర్పాటు చేశాం. నాడు–నేడు ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినుల కోసం కళాశాలకు చేరువలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్ ఫలితాల సాధనలో విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాల పునఃప్రారంభం కానున్న దృష్ట్యా ప్రవేశాలు కల్పిస్తున్నాం.

– గన్నెపూడి సునీత, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

ఫిరంగిపురంలో 32.2 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 32.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 1.2 మి. మీ వర్షం పడింది. సగటున 6.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. చేబ్రోలు 28.2 మి.మీ., కొల్లిపర 19.4, దుగ్గిరాల 9.6, పొన్నూరు 9.2, తాడికొండ 6.2, తుళ్ళూరు 4.8, మంగళగిరి 3, గుంటూరు పశ్చిమలో 1.8 మి.మీ చొప్పున వర్షం పడింది. మే నెల 19వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 38.1 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 80.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

'ఏపీ మోడల్' కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ జూనియర్ కాలేజిలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.రవినాయక్ ఆదివారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఆయా గ్రూపులకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఆడ పిల్లలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు కాలేజీలో సంప్రదించాలని కోరారు.

డ్రైవర్లకు ఆర్టీసీ శిక్షణ

నగరంపాలెం: గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామాల్లోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఉన్న (కారు/జీప్) డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ గుంటూరు–2 డిపో డీఎం ఎస్కే అబ్దుల్ సలామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ గుంటూరు– 2 డిపోలోని హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్‌లో 15వ బ్యాచ్‌లో శిక్షణ పొందేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు డీఎం పేర్కొన్నారు. శిక్షణ పొందగోరే డ్రైవర్లు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని, బ్యాచ్‌కు 16 మంది మాత్రమే అర్హులని తెలిపారు. ప్రతి ఒక్కరితోనూ 15 కి.మీ. బస్ డ్రైవింగ్ చేయిస్తామని, వీడియో దృశ్యాల ద్వారా ప్రమాదాలు జరిగే తీరు, వాటి నివారణపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 8897371003, 7382894585 నంబర్లలో సంప్రదించాలని డీఎం తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

- వివాదాలకు దూరంగా ఉండకపోతే చట్టరీత్యా చర్యలు
- డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్
- పెదపరిమిలో పోలీసు కవాతు



పెదపరిమిలో కవాతులో పాల్గొన్న డీఎస్పీ అశోక్ గౌడ్, సీఐ అనురాధ, ఇతర పోలీసు సిబ్బంది

పెదపరిమి(తాడికొండ): సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఫ్యాక్షన్ పడగ ఉన్న వివాదాస్పద గ్రామమైన తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో ప్రత్యేక పోలీసు బలగాలతో ఆయన కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు గ్రామాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ర్యాలీలు, సభలు, ఇతర వివాదాస్పద కార్యక్రమాల నిర్వహణ నిషేధం అన్నారు. వివాదాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక చర్యలు ఉంటాయని, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వ్యక్తులపై యాంటీ సోషల్ అండ్ హజార్డస్ యాక్టివిటీస్ యాక్ట్ నంబర్ 9, 1980 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి వివాదాలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. రౌడీషీటర్లు, వివాదాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎక్కడైనా బెదిరింపులు, ఘర్షణలకు దిగినట్లు తెలిస్తే తమకు తక్షణ సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ జె.అనురాధ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల రూట్ ఫ్లాగ్ మార్చ్..

నగరంపాలెం: జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు, ప్రత్యేక బలగాలతో ఆదివారం కవాతు (రూట్ ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు జిల్లా అంతటా కొనసాగగా, గ్రామాల్లోనూ, ప్రధాన కూడళ్లల్లో నడిచివెళ్లారు. తూర్పు, పశ్చిమ, తెనాలి, దక్షిణ, ఉత్తర సబ్ డివిజన్లలో కవాతు జరిగింది. ఆయా చోట్ల 144 సెక్షన్ అమల్లో ఉందని స్థానిక ప్రజలకు తెలియజేసి, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గుంపులుగా ఉండవద్దని సూచించారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల నిర్వాహకులు పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లల్లో విక్రయించవద్దని సూచించారు. ఈ మేరకు జిల్లాలో బాణసంచా నిల్వ చేసే కేంద్రాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. నల్లపాడు పీఎస్ పరిధిలోని స్వర్ణభారతినగర్, పరిసరా ప్రాంతాలు, మంగళగిరి రూరల్ పీఎస్, తెనాలి ఒన్‌టౌన్ పీఎస్ పరిధిలోని సమస్యతక ప్రాంతాలు, తూర్పు సబ్ డివిజన్‌లోని లాలాపేట పీఎస్, కొత్తపేట పీఎస్, పాతగుంటూరు పీఎస్‌ల పరిధిలో తమిళనాడు పోలీసులు, ప్రత్యేక పోలీసులు, పశ్చిమ సబ్ డివిజన్‌లోని నగరంపాలెం పీఎస్, పట్టాభిపురం పీఎస్, అరండల్‌పేట పీఎస్‌ల పరిధిలోనూ కవాతు చేపట్టారు. ఆయా సబ్ డివిజన్లలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాణసంచా దుకాణ నిర్వాహకునికి సూచనలు చేస్తున్న పోలీస్ అధికారి

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం.. స్వల్ప గాయాలతో బయటపడ్డ ప్రయాణికులు



కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చినకాకాని వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి 35 మంది ప్రయాణికులతో విజయవాడ బయల్దేరిన గుంటూరు –2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చినకాకాని వద్ద ఆటోను క్రాస్ చేయబోయి అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లగా.. వంతెన గోడకు ఢీకొట్టి ఆగిపోయింది. ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్నవెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థులకు మంగళవారం నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ కన్వీనర్ కె.సాయికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రాడీపేట యూటీఎఫ్ సమావేశ మందిరంలో సాయంత్రం ఆరు నుంచి 8 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులకు పదో తరగతి ఆపైన చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకులు, ఉన్నత అధికారులతో శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 7207566 702, 6309481514, 86888 97406 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగుల్లో సామాజిక స్పృహ, బాధ్యతను పెంచేలా కృషి

రాష్ట్ర ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, పక్కన సంఘ నాయకులు

లక్ష్మీపురం: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజా ప్రయోజనాలకనుగుణంగా ప్రజాస్వామిక స్పృహను కలిగించటంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించేలా ఉద్యోగుల సమన్వయ కమిటీ దశాబ్దాలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కృషి చేస్తోందని రాష్ట్ర ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'ముందు మనం మానవులం ..పౌరులం..ఆ తర్వాతే ఉద్యోగులం' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం విరసం రాష్ట్ర నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్, మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో శాస్త్రీయ సోషలిజాన్ని ప్రచారంతోపాటు ఆచరింప చేయటం ద్వారానే దోపిడీ రహిత సమసమాజాన్ని నెలకొల్పేలా ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు పద్మజ షా సామాజిక బాధ్యత అంశంపై ప్రసంగించారు. ఏఎన్‌యూ ప్రొఫెసర్ జి.అంజిరెడ్డి 'భారత రాజ్యాంగం– బీజేపీ వైఖరి' అంశంపై మాట్లాడారు. ఉద్యోగుల సమన్వయ కమిటీ జేఏసీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ జి.డి.హనుమంతరావు 'ఉద్యోగ వికాసం' పత్రిక ఆవిష్కరించారు. డీఆర్ మంజుల సభకు స్వాగతం పలుకగా కార్యక్రమంలో సమన్వయ కమిటీ కార్యదర్శి ఎస్.ఎస్.గాంధీ ఉద్యోగ వికాసం పత్రిక ప్రధాన సంపాదకులు ఎన్వీ నరసింహారావు, టి.శ్రీనివాసరావు, ఉద్యోగ క్రాంతి సంపాదకులు ఎస్.వెంకటేశ్వర్లు, కో–ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి జి.హనుమంతరావు, పలువురు ప్రజా ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రజా గాయకులు గని, బెన్హర్ బాబులు ఆలపించిన అభ్యుదయ చైతన్య గీతాలు అలరించాయి.

అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక సదస్సుకు డాక్టర్ శివనాగిరెడ్డి

బౌద్ధ పర్యాటక స్థావరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్



బ్రోచర్ ఆవిష్కరణలో శివనాగిరెడ్డి, అతిథులు

తెనాలి: నాగార్జున సాగర్‌లో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టు కన్సల్టెంటుగా వ్యవహరిస్తున్న తెనాలికి చెందిన ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అరుదైన అవకాశం అందుకున్నారు. భూటాన్‌లోని థింపూ నగరంలో జరిగిన అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక సదస్సుకు హాజరయ్యారు. అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్, భూటాన్ పర్యాటక సమాఖ్య సంయుక్తంగా నిర్వహించిన సదస్సు ఆదివారంతో ముగిసింది. ముగింపు సభలో డాక్టర్ శివనాగిరెడ్డి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బౌద్ధ పర్యాటక స్థావరాలు, బుద్ధవనంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆసియాలోనే అరుదైన బౌద్ధ వారసత్వ బుద్ధవనం బ్రోచర్‌ను అక్కడ ఆవిష్కరింపజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాయల్ భూటాన్ విశ్వవిద్యాలయ ఆచార్యులు, డా.సౌరవ్ బసు, ఏబీటీఓ ప్రధాన కార్యదర్శి డా. కౌలేష్ కుమార్ బుద్ధవనం బ్రోచర్‌ను ఆవిష్కరించినట్టు తెలిపారు. అనేక ప్రత్యేకతలన్న బుద్ధవనాన్ని, బౌద్ధ పర్యాటక స్థావరాలను త్వరలో సందర్శిస్తామని భూటాన్ పర్యాటక సమాఖ్య ప్రతినిధి, ఐ–డిజైర్ అధినేత పరశురాం బిస్వా చెప్పినట్టు డాక్టర్ శివనాగిరెడ్డి తెలియజేశారు. సదస్సు ముగింపు సభలో స్థానిక ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్ దేశాల స్థానిక ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారని వివరించారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్‌వేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్ర తదితరులు


గుంటూరు రూరల్: క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక దృఢత్వం, పోటీ తత్వం మెరుగు పడుతుందని మిర్చియార్డు డైరెక్టర్ బొందలపాటి వెంకటేశ్వరరావు (ఇంద్ర) తెలిపారు. ఆదివారం ఇంద్ర యూత్ ఆధ్వర్యంలో మండలంలోని వెంగళాయపాలెం గ్రామం కైలాసగిరి సమీపంలో గల గ్రౌండ్‌లో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంద్ర మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి గ్రామీణ స్థాయిలోని క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. యువతలోని క్రీడా స్ఫూర్తిని పెంచుతూ క్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచునేందుకు ఇటువటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ క్రీడల్లో జిల్లావ్యాప్తంగా 50 టీంలు పాల్గొంటున్నాయన్నారు. నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ మ్యాచ్‌లో ఎంట్రీ ఫీజు రూ 999 చెల్లించాలన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ 20 వేలు, తృతీయ బహుమతి రూ 10 వేలు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ 1,116లు, బెస్ట్ బౌలర్‌కు రూ 1,116లు, మాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ 2,116లను అందజేస్తామన్నారు. టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ యర్రంశెట్టి పవన్‌కుమార్, షేక్ జానీ, వేడిపాళ్ళ శివ కాంత్‌రెడ్డి, షేక్ సాహెల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సాంస్కృతిక సంబురం

- జాతీయస్థాయి సంగీత నాట్య కళారూపాల పోటీలు
- కళానిలయం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహణ
- చిలకలూరిపేట వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపం వేదిక



ప్రగడ రాజ మోహనరావు



కళానిలయం చిహ్నం

చిలకలూరిపేట: సాంస్కృతిక సందడి రానుంది. కళాకారులతో వీధులన్నీ కళకళలాడనున్నాయి. చిలకలూరిపేట కళానిలయం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జాతీయస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఏటా సంగీత, నాట్య, కళారూపాల పోటీలు నిర్వహిస్తున్నారు. 23వ తేదీ వరకు మూడు రోజులపాటు కొనసాగుతాయి.

ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..

పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపం ఈ పోటీలకు వేదిక కానుంది. పాశ్చాత్య నృత్య, సంగీత హోరులో ఆదరణ కోల్పోతున్న భారతీయ సంప్రదాయ కళలకు ఊతమిచ్చేందుకు ప్రస్తుత తరుణంలో కళానిలయం వేదికగా నిలుస్తోంది. పలు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కళాకారులు పాల్గొని భారతీయ సంస్కృతి, సంప్రదాయలను తమ అద్భుత కళారూపాల ద్వారా భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తున్న కళాకారులు భాగస్వాములు కానున్నారు. మూడున్నర దశాబ్ధాలకు పైగా కళలను బతికిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్న ఘనత కళానిలయ వ్యవస్థాపకులైన ప్రగడ రాజమోహనరావుకే దక్కుతోంది. 1984లో కళానిలయాన్ని స్థాపించి కళామతల్లికి సేవలందిస్తున్నారు.

సినీ ప్రముఖులకు ఘనసత్కారాలు...

కళానిలయం ద్వారా కేవలం పోటీలను నిర్వహించటానికే పరిమితం కాకుండా ప్రముఖ కళాకారులకు సన్మానిస్తుంది. ఇప్పటి వరకు ఇక్కడ ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సినీ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్, నటులు మిక్కిలినేని రాధాకష్ణమూర్తి, నాటితరం నటీమణులు అంజలి దేవీ, షావుకారు జానకీ, బుర్రకథ పితామహుడు నాజర్, నాట్యాచార్యులు వేదాంతం సత్యనారాయణ శర్మ, సినీ నృత్య దర్శకుడు పీవీ శేషు, ఆంధ్రా జాలరి బిరుదాంకితుడు ఆనం లక్ష్మణరావు, ప్రముఖ కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి, సినీనటి రోజారమణి, ప్రఖ్యాత నర్తకి స్వాతి సోమనాథ్, గేయరచయిత్రి శశిబాల చేబ్రోలు వంటి ఎందరో ప్రముఖులు ఈ వేదికపై ఘన సత్కారాలు అందుకున్నారు.

కళాకారులతో కళకళలాడనున్న వేదిక....

కళానిలయం 39వ జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మందిపైగా కళాకారులు రానున్నారు. సూర్య, చంద్ర విభాగాల పేరిట రెండు గ్రూపులుగా పోటీలను నిర్వహించనున్నారు. కూచిపూడి, భరతనాట్యంతో పాటు శాస్త్రీయ బృంద నాట్యాలు, సినీ మధుర గీతాలు, యుగళ గీతాలు, నృత్య నాటికలు, శాస్త్రీయం కాని బృంద నాట్యాలు, నృత్య నాటికల పోటీలు ఉంటాయి.

పెట్రోలు, డీజిల్ విడి అమ్మకాలపై ఆంక్షలు



మాచర్ల ప్రాంతంలో పోలీసులు పట్టుకున్న పెట్రోలు బాంబులు(ఫైల్)

నరసరావుపేట: పల్నాడు జిల్లా వ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ విడి అమ్మకాలపై పౌరసరఫరాలు, పోలీసు అధికారులు ఆంక్షలు విధించారు. ఎన్నికల రోజు, ఆ తర్వాత జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పెట్రోలు బాంబులు వినియోగించటాన్ని గమనించిన జిల్లా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. జిల్లా వ్యాప్తంగా 188 పెట్రోలు బంకులు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. వాటి ద్వారా ప్రతిరోజూ లక్షల లీటర్ల, పెట్రోలు, డీజిల్ విక్రయాలు జరుగుతుంటాయి. వాహనాలు కాకుండా క్యాన్లు, ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ విక్రయాలు చేస్తుంటారు. ఈవిధంగా సేకరించిన పెట్రోలును సీసాల్లో పోసి వాటికి ఒత్తులు ఏర్పాటు చేసి నిప్పంటించి ప్రత్యర్థుల ఆస్తులు, వాహనాలు, వ్యక్తులపై విసరటం లాంటి ఘటనలో జిల్లాలో జరిగాయి. పలుచోట్లు పోలీసులు చేసిన సోదాల్లో వీటిని స్వాధీనం చేసుకోవటం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పెట్రోలియం షాపుల నుంచి బాటిళ్లలో, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ నింపరాదని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రిటైల్ షాపు లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఇంటివద్దకే రేషన్ బియ్యం పకడ్బందీగా అమలు

మే నెలలో 86.98శాతం మందికి పంపిణీ



సాతులూరులో జరుగుతున్న పీడీఎస్ బియ్యం పంపిణీ పరిశీలిస్తున్న డీఎస్ఓ

నరసరావుపేట: జిల్లాలో గడిచిన ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన ఇంటివద్దకే రేషన్ బియ్యం పంపిణీ పకడ్బందీగా అమలౌతుంది. ఈనెలలో జిల్లాలోని 28 మండలాల్లో గల 1289 డీలర్‌షిప్‌ల ద్వారా 402 ఎండీయూ వాహనాల సహాయంతో 6,45,110మంది లబ్ధిదారుల్లో 5,61,116 (86.98శాతం) మందికి పంపిణీ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు రేషన్‌షాపులకు వచ్చి బియ్యం, ఇతర నిత్యావసరాలు తీసుకోవాల్సి వుండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే డీలర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకే తీసుకెళ్లి ఇవ్వాలనే కార్యక్రమం అమలు చేశారు. దీనికోసం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి విజయవంతంగా అమలు చేశారు. ఈ మాసంలో 5,61,127మందికి బియ్యం, 63,814మందికి ఫోర్టిఫైడ్ ఆటా, 3,07,664మందికి కందిపప్పు, 3,51,254మందికి పంచదార అందజేశారు. అత్యధికంగా నరసరావుపేటలో 93.46శాతం మందికి పంపిణీ చేయగా, చిలకలూరిపేటలో 91.70 శాతం పంపిణీ చేశారు. అత్యల్పంగా వెల్దుర్తి మండలంలో 81.13శాతం పంపిణీ జరిగింది. ఈనెల 17వ తేదీతో పంపిణీ ముగియనుండగా ప్రభుత్వం మరో రోజు పెంచటంతో శనివారం వరకు పౌరసరఫరాల శాఖ అధికారులు పంపిణీ చేపట్టి పూర్తి చేశారు.

హెచ్‌ఐవీ బాధితులకు ప్రభుత్వం అండ



పల్నాడురోడ్డులోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ

నరసరావుపేట: హెచ్‌ఐవీతో బాధపడుతూ మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలనే ఉద్దేశంతో ప్రపంచవ్యాప్తంగా మే 19న నిర్వహించే ఇంటర్నేషనల్ క్యాండిల్ మెమోరియల్ డేను ఆదివారం నరసరావుపేటలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా డీఎల్‌ఏటీఓ డాక్టర్ మురళీకృష్ణ, పల్నాడు రోడ్డులోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ ప్రధాన రహదారుల మీదగా సాగింది. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ క్యాండిల్ మెమోరియల్ డే 1986 నుంచి 38 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా అన్నీ దేశాలు నిర్వహిస్తున్నాయని అన్నారు. హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారందరికీ మేమున్నాము అనే ధైర్యాన్ని ఈ క్యాండిల్ ర్యాలీ ద్వారా కల్పిస్తున్నటు చెప్పారు. ప్రభుత్వం ఏపీ సాక్స్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారందరికీ ఉచిత వైద్యంతో పాటు, ఆర్థిక, సామాజిక సేవలు అందిస్తుందని వివరించారు. ప్రభుత్వ హాస్పిటల్ ఆర్‌ఎంఓ డాక్టర్ దయానిధి, ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్‌రావు, పీఎం ఉదయ్ కుమార్, గౌస్, పీడీ భరత్, కోమలి, రోహిణి పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

అవనిగడ్డ: బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన కొల్లాటి అశోక్‌కుమార్‌కు అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడల్లో పాల్గొనేందుకు అవనిగడ్డకు చెందిన పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. మత్స్యకార కుటుంబానికి చెందిన అశోక్‌కుమార్ అంతర్జాతీయ క్రీడలో ఒకటైన ముయాయ్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం పొందారు. కోవిడ్ ముందు వరకూ నాట్కో కంపెనీ ఇతనికి ఆర్థికసాయం అందించింది. వచ్చే నెలలో నార్త్ అమెరికాలో జరిగే అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశం అశోక్‌కుమార్‌కు వచ్చింది. అక్కడకు వెళ్లేందుకు చేతిలో డబ్బుల్లేక ఆందోళనకు గురువుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుమొండి గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు ఆదివారం తన కార్యాలయంలో రూ.1లక్ష అందించి, ఘనంగా సత్కరించారు.